

# పసిడిమనసులు - షర్మిల



## ఏటవతలి జ్ఞాపకం

**క్రిష్ణకి** అవతల మా నాయనమ్మ ఊరైతే క్రిష్ణ ఇవతల అమ్మమ్మగారి వూరు.

ఏటవతల క్రిష్ణా జిల్లా అయితే ఇవతల గుంటూరు జిల్లా . ఒకళ్లనొకళ్లు మాత్రం ఏటవతలాళ్లు అనే పిలుచుకుంటారు.

అక్కడా వస్తాంది , ఎళ్తాంది అంటే ఇక్కడ వచ్చుద్ది, ఎళ్లుద్ది అంటారు.

మధ్యలో ఏరే అడ్డం అనుకుంటాం గానీ ఇళ్లోరకం ఆళ్లో రకం.

" మీ క్రిష్ణా వాళ్ల మాట ఎచ్చు మానిక పిచ్చ!" అని గుంటూరాళ్లు అంటే

" గొడ్డుకారం తినే మీకేం తెలుసు నాగరీకం " అని క్రిష్ణా వాళ్లు ఎత్తిపొడుస్తారు.

అయితే మధ్యలో వున్న క్రిష్ణమ్మలాగా ఇద్దరికీ చెందినదాన్ని కదా ఆడా ఈడా కూడా ఇష్టంగానే వుంటా. మా అమ్మమ్మ గారి ఊరు గుంటూరు జిల్లాలో వున్న జంపని బస్ మీద ఎళ్లాలంటే చాలాదూరం. బెజవాడ వరకూ బస్ అక్కడి నుంచి తెనాలి వరకూ బస్ , అక్కడ మళ్లీ జంపని వరకూ బస్ ఎక్కాలి. అదే క్రిష్ణ దాటి ఎళ్తే చాలా దగ్గర. శ్రీకాకుళం గానీ పులిగెడ్డ మా వూరికి పది మైళ్ల లోపే. అక్కడ క్రిష్ణా నది దాటితే అవతల పక్క కొల్లూరు ఎళ్లతాం.

అక్కడనుంచి అమ్మమ్మ గారి వూరు చాలా దగ్గర . కానీ ఇసకలో బోల్డు దూరం నడవాలని బెజవాడ మీదగా ఎక్కువ ఎళ్లే వాళ్లం.

అమ్మ నాన్న ఉద్యోగం చేసే చోటు నుంచి రైల్లో వచ్చి బెజవాడ దిగి పుట్టింటికి ఎళ్లిందంట. నన్ను కూడా తన దగ్గరికి పంపమని ఉత్తరం రాసింది.

" అబ్బాయ్ కాస్తి తీరికజేసుకుని దీన్ని జంపని దింపయ్యా !" అని మన్నానని (పెదనాన్నని ) బతిమలాడింది నాయనమ్మ.

" పిన్నీ !అమ్మడు లేందే మనకి ఇల్లు బెలో మంటా వుంటంది, ఇప్పుడు ఎందుకులే " అనేశాడు .

" ఇంకా నయం ! ఆళ్ల అమ్మ బిడ్డని చూసి ఏడాదైంది , చూసుకోవాలని వుండదా ? దింపిరా ... మా అయ్య గదూ" అంది.

ఈ సారి ఏరు దాటి జంపని బయల్దేరాం. నాకు ఇట్టా దగ్గిర తోవ అయితేనే ఇష్టం ఎందుకంటే నాకు ఎర్రబస్ ని చూస్తే వాంతొస్తుంది.

అదే ఇటేపు హాయిగా కొంచం సేపు పడవ కూడా ఎక్కొచ్చు. పొద్దున్నే నేను మన్నాన్న బయల్దేరాం. క్రిష్ణ ఒడ్డుకు వెళ్తే మొత్తం ఇసకే ! ఎక్కడో కాసిని నీళ్లు కనిపించినియ్. కాస్త దూరం నడిచేసరికే కాళ్లు నెప్పి అనడం మొదలెట్టాను.

"అయితే నడవొద్దులే అమ్మా ! " అని మెడల మీద ఎక్కించుకున్నాడు.

మన్నాన్న మెడకి అటో కాలు ఇటో కాలు వేసి హాయిగా కూర్చున్నా. నీళ్ల దగ్గరికి వచ్చాక అక్కడ పడవ ఎక్కాం. కొల్లూరు దగ్గర దిగి బస్ ఎక్కి జంపని ఎళ్లాం.

బస్ గాంధీ బొమ్మ దగ్గరికి రాగానే దిగి నడుస్తున్నాం.

దారిలో ఎత్తు అరుగుల మీద కూర్చుని కబుర్లు చెప్పుకునే వాళ్లు మా వంక చూస్తా ఎవరింటికి ? అని అడిగారు.

" నరసయ్య గారి ఇంటికి ఎళ్తన్నాం, ఇదిగో ! ఆళ్ల మనవరాలే ఈ అమ్మాయి "అనగానే" పంతులు గారి మనవరాలా !" అని అనడం మొదలెట్టారు .

" ఏంటి నరసయ్య తాత మనూళ్లో ఆచార్లుగారికి మల్లే గుళ్లో పూజలు చేస్తారా?" అనడిగా.

మన్నాన ముసి ముసిగా నవ్వుతూ " కాదమ్మా మీ తాత ఇక్కడ బళ్లో హిందీ మాస్టారు , అందుకే పంతులుగారు అని పిలుస్తున్నారు" అని చెప్పాడు.

నేను పుట్టిన దగ్గర నుంచి నాయనమ్మ, తాత దగ్గరే వుంటంతో అమ్మమ్మ , తాత గురించి ఎక్కువగా తెలీదు. ఎప్పుడో పసిపిల్ల గా వున్నప్పుడు అమ్మతో వచ్చానంట గానీ నాకు గుర్తు లేదు. అమ్మమ్మ వాళ్ల ఇంటికి చేరగానే అమ్మ ఎదురొచ్చింది. నేను సిగ్గుతో మన్నాన్న వెనకాల నక్కాను.

మా అమ్మని ఎప్పుడో ఏడాదికి ఒకసారి చూస్తాను మరి !

మన్నాన నన్ను వదిలి ఆ సాయంత్రం ఎళ్లిపోతుంటే "నువ్వూ వుండు నాన్నా ! అని గోల చేశాను."

అమ్మమ్మగారి ఇల్లు పాత కాలంలో కట్టిన ఇల్లు ఆ ఇంట్లో నాలుగు వాటాలుంటాయి . ఇంటి మధ్యలో మండువా చుట్టూ గదులు. ఒక్కో కుటుంబానికి ఒక పెద్దగది. భోజనాల గది, వసారా వుంటాయి. గదులు పేరుకే కానీ అందరూ పగలు వసారాలో వేసవి కాలం ఇంటి మధ్య వున్న మండవాలోనో మంచాలేసుకుని పడుకుంటారు. రాత్రయితే బయటే మంచాలేసుకుని పడుకుంటాం. అక్కడున్న బుల్లి మంచం నాకు భలే నచ్చింది. ఒక్కదాన్నే ఏనాడూ పడుకోనిదాన్నల్లా ఆ మంచం మీద ఒక్కదాన్నే పడుకున్నాను. మా వూళ్లో నాయనమ్మ, తాత, తమ్ముడు వుంటాం.

మన్నాన్న రోజూ వచ్చి వెళ్తాడు . కానీ ఇక్కడ బోలెడు మంది జనం. అమ్మమ్మ,తాత కాకుండా అదే ఇంట్లో చుట్టూ వుండే కుటుంబాలతో సందడిగా వుంది. మా అమ్మ వాళ్ల తాతని నాయనమ్మని కూర్చోబెట్టి పువ్వులు కోసుకొచ్చి వాళ్లకి పెళ్లి చేస్తానని ఇద్దరి నెత్తి మీద పూలు తలంబ్రాలు పోస్తుంటే చూసే వాళ్లంతా నవ్వు.

నేను పాలు తాగుతుంటే అక్కడ వున్న పిల్లి నన్నే చూస్తుంటే "అమ్మో పిల్లి !" అని అమ్మ దగ్గరికి వెళ్లి దాక్కున్నాను.

" పిల్లంటే మీ అమ్మాయికి ఇంత భయమేంటే !" అని అమ్మమ్మ అంటే నాకు కోపం వచ్చింది.

" మా బార్లపూడి పిల్లికైతే జడవను ఇక్కడి పిల్లికైతేనే జడుస్తా " అని చెప్పేశాను.

రోజూ చీకటి పడగానే కాంతమ్మ నాకు అన్నం తినిపించేది. కాంతమ్మ అమ్మ వాళ్ల అమ్మమ్మ . పాలు పోసి వండిన కూరలో నెయ్యేసి పెట్టేది. ఆ రోజు కూడా పురి కోసం కట్టిన చప్టా మీద కూర్చోబెట్టి అన్నం తినిపించింది.

" ఏందే అమ్మాయ్ ! ఇక్కడ నీకు బాగుందా మీ నాయనమ్మ దగ్గర బాగుందా?" అని అడిగింది.

“నాకు ఇక్కడ కూరలు బాగుండయ్యి” అన్నాను బుగ్గల నిండా కూరిన ముద్ద మింగుతూ.

అసలు మా అమ్మమ్మ వాళ్ల ఇంట్లో చేసే బెల్లం జిలేబీ , నువ్వుల జీడీలు ఎంత బాగుంటాయో. మమ్మల్ని చూడటానికి మా తాత వాళ్లు బార్లపూడి వస్తే అమ్మమ్మ పెద్ద కేనుడు జిలేబీ నాకిష్టమని పంపేది. పసితనం నుంచి నాయనమ్మే పెంచడంతో అమ్మమ్మ ఇంటికి చుట్టంలాగా ఎప్పుడన్నా పంపేవారు. ఆవాళ పొద్దున్నే అందరూ కాఫీలు తాగుతా పొయ్యి దగ్గర కూర్చున్నారు . కాంతమ్మ వచ్చి కాసిని దనియాలు, ఎండు మిరపకాయలు వేయిస్తాంది.

"ఏంటే తెల్లారే పాటికి నల్లగారం కొడతావా ఏంది?" అని అమ్మమ్మ అడిగితే "ఏంటోనే నిన్నటి నుంచి కడుపులో తిప్పినట్టుంటాంది," నల్లకారం నోటికి బాగుంటందని అని రోటి దగ్గరికి వెళ్తా  అంది కాంతమ్మ .

రోటి దగ్గర కారం దంచుతా ఆ బండ మీదే  తల పెట్టుకున్న కాంతమ్మని చూసి "ఏంటే అమ్మా! ఏమైంది" అని అమ్మమ్మ అంటావుండగానే కాంతమ్మ కిందకి వాలిపోయింది.

గబగబా చెయ్యి పట్టుకుని చూసి గొల్లుమన్నారు.

కాంతమ్మ చచ్చిపోయిందంట. చచ్చిపోడం ఏంటో అప్పుడే తెలిసింది. అప్పుడు నాకు నాలుగేళ్లు. నిన్న నాకు బువ్వ పెట్టిన కాంతమ్మని గడ్డి మీద దుప్పటి పరిచి పడుకోబెట్టారు. తరవాత రోజు కాంతమ్మ అక్కడ కూడా లేదు. పాల కూరలతో కమ్మగా తినిపించిన కాంతమ్మ మాయమైపోయింది.

ఎప్పుడు జంపని ఎళ్లినా నాతో పెళ్లి చేయించుకున్న నా ముత్తాత ముత్తవల జంట , పురి దగ్గర కూర్చోబెట్టి అన్నం పెట్టిన కాంతమ్మ, చిన్న వాళ్లని కూడా మీరు అని పిలిచే మా పంతులు తాతయ్య, కమ్మటి జిలేబీలు నాకోసం పంపిన అమ్మమ్మ గుర్తొస్తారు.

వీళ్లందరినీ చూసిన మండువా ఇల్లు కూడా జ్ఞాపకాల బరువుకో వయసు మీదపడో ఓ పక్కకి వాలిపోయింది. రెక్కలొచ్చిన పిట్టలన్నీ ఎగిరిపోయిన గూడులా ఏకాంతంగా మిగిలింది.

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments